కథ

# వంచన

## -కొమ్మూరి కోటేశ్వరరావు

ఆరోజు బంధువులొచ్చారు. పని ఎక్కువగా వుండడం వల్ల బాగా అలసి మధ్యాహ్నం నిద్ర పోయాను. అమ్మ వచ్చి నిద్రలేపి తలంటి స్నానం చేయమని చెప్పే వరకూ మెలకువ రాలేదు. ఎంత గాఢ నిద్ర పోయానో అప్పుడర్థమైంది.

వచ్చిన బంధువులంతా పిండి వంటల తయారీలో నిమగ్నమై వున్నారు. నాకు తెలిసి ఇంత భారీ ఏర్పాట్లు చేసింది ఎప్పుడూ లేవు. స్నానాల గది వైపు వెడుతున్న వదిన కనిపించింది. అడిగాను "ఏమిటి వాళ విశేషం? ఇంత హడావిడి చేస్తున్నారేమిటి?" అని.

"ఏమిటే మృదులా! నీకు పెళ్ళి చూపులన్న విషయం నీకే ఇంకా తెలియదా!" ఆశ్చర్యంగా మొహం పెట్టి ఉత్సాహంగా చెప్పేసి, ఆ తరువాత చెప్పకూడనిది ఏదో చెప్పినట్టు వదిన నాలుక కరుచుకుంది.

ఆందోళన నిండిన స్వరంతో గద్దించి ప్రశ్నించాను. "నిజం చెప్పు వదినా! నాకు పెళ్ళి చూపులా? ఎవరు ఇదంతా ఏర్పాటు చేస్తోంది?" ప్రశ్నల వర్షం కురిపించడంతో అప్పటికే గాబరా పడ్డ వదిన తనకి తెలిసినా, తెలియదన్నట్టు మొహం పెట్టి వడివడిగా స్నానాల గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది.

ఒక్క క్షణం నాకు మనసాగలేదు. వెంటనే అమ్మ వద్దకు వచ్చి, "వదిన చెప్పింది నిజమేనా?" అని కోపంగా ప్రశ్నించేసరికి ఇక దాచడం ఇష్టం లేని అమ్మ–

"నిజమే మృదూ! నీకు ముందే తెలిస్తే అంగీకరించవని అన్నయ్య చివరి నిమిషం దాకా చెప్పవద్దని ఏర్పాట్లు చేస్తున్నాడు. అయినా వాడు చేసేది నీ మంచి కోసమే కదటే..పెళ్ళీ పెటాకులు లేకుండా ఎంత కాలమని వుంటావు? వాళ్ళు వచ్చే వేళవుతోంది. వెళ్ళి త్వరగా ముస్తాబవ్వు" అంటూ అమ్మ తొందర చేయసాగింది.

"మృదూ! బంధువుల ముందు అల్లరి చేయడం మంచిది కాదు" అప్పుడే అక్కడికి వచ్చిన అన్నయ్య అనడంతో నా నోరు మాట్లాడటం మానేసింది. "అబ్బాయికి బ్యాంకులో ఉద్యోగం. ఇంతకన్నా మంచి సంబంధం మరొకటి దొరకదు.నీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ఒప్పించే ఓపికా, సహనం నాకు లేవు. కింద పెళ్ళి వారు వచ్చి కూర్చున్నారు. అయిదు నిమిషాల్లో వారి ముందుండాలి" అంటూ నా సమాధానం కోసం కూడా ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు అన్నయ్య.

మా ఇంట్లో అన్నయ్య మాటకు తిరుగుండదు. అందుకే ఈ రహస్యం నాతో ఎవరూ చెప్పడానికి సాహసించలేదని అర్థమైంది. ఇక నా రోదన వారి ముందు ఏపాటిది? గత్యంతరం లేక పెళ్ళిచూపులు తప్పించుకునే మార్గాన్ని అన్వేషిస్తూ అలంకరించుకున్నాను.

బంధువులు వెంటరాగా తల వంచుకుని నడుచుకుంటూ వెళ్ళి కూర్చున్నాను. ప్లేట్లు, సాసర్ల చప్పుణ్ణిబట్టి అల్పాహారం పూర్తి చేసి నన్ను చూడడానికి సిద్ధమయ్యారని అర్థమైంది.

వైవాహిక జీవితంపై విరక్తి చెంది, ఐహిక సుఖాలను త్యజించి, కుటుంబ వ్యవస్థ అనే అనుబంధాన్ని వదులుకుని ఒంటరిగా జీవించాలని నేను చూస్తోంటే, నాకు తెలియకుండా వారు పెళ్ళి చూపుల ఏర్పాట్లకు సంకల్పించడం నన్ను మరింత ఆవేదనకు గురి చేసింది.

'వంటిపై కాసు బంగారమైనా లేకుండా సన్నగా, నాజూగ్గా, రంగుకు తగిన అందం, పొడవుకు తగ్గ లావు, ఆ కట్టూ బొట్టూతో కుందనపు బొమ్మలా వుంది' అంటూ అబ్బాయి తరపు వాళ్ళు నన్ను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. నా ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేనట్టుంది. వారి ప్రవర్తన చూస్తుంటే అబ్బాయికి నచ్చకపోయినా పెళ్ళి చేసే విధంగా మాట్లాడుకుంటున్నారు.

"ఏది ఏమైనా మీది చూడ ముచ్చటైన జంటరా! మహాలక్ష్మి లాంటి అమ్మాయిని యేరి కోరి ఎంచుకున్నావు" అని వాళ్ళల్లో ఒకామె అనగానే అది విన్న నా గుండెల్లో గుబులు రేగింది. మనసంతా ఆందోళనతో నిండిపోయింది.

అతనెవరు?... తనన్నెప్పుడు చూశాడు?.. తను అతనికి ముందే తెలుసా? లేక ఎక్కడైనా చూసి నచ్చి వచ్చాడా? గతాన్ని ముందే తెలుసుకుని వచ్చాడా? నా మనసంతా ఆలోచనలతో అల్లుకుపోయింది. పైన సీలింగ్ ఫ్యాన్ తిరుగుతుందన్న మాటే గానీ, నాలో రేగుతున్న ఆలోచనలతో బుర్ర వేడెక్కి, అంతకన్నా వేగంగా ముచ్చెమటలు పోస్తున్నాయి. నాగురించి అతనికి ముందే తెలిసి వుంటే, అతని మొహంలోకి సూటిగా ఎలా చూడగలదు? అర్థంగాని అయోమయ పరిస్థితి..తక్షణ కర్తవ్యం కోసం గింజుకుంటున్నాను. నేనతనికి నచ్చకూడదని అప్పటి వరకూ వేయి దేవుళ్ళకు మనసులోనే మొక్కినా, ఒక్క దేవుడూ నా మొర ఆలకించలేదన్నమాట! అతనెవరో ముందుగానే ఒక పథకం ప్రకారం అన్ని విషయాలూ అన్నయ్యతో మాట్లాడుకుని, తన చుట్టూ ఒక పద్మవ్యూహంతో వచ్చాడని అర్థమయ్యేసరికి...

అంతలోనే ఒక పెద్దావిడ అంది–

"ఒరేయ్ అబ్బాయీ! అమ్మాయితో ఏదైనా మాట్లాడాలని వుంటే మాట్లాడు" అంది. ఆ మాట వినేసరికి నాకు పై ప్రాణాలు పైనే పోయినట్టయ్యింది. గుండె మరింత వేగంగా కొట్టుకోసాగింది. వంచిన తల ఎత్తకుండా మరింత ఒదిగిపోయి కూర్చుండిపోయాను.

"మృదులా" చిన్నగా పిలుపు విన్పించింది. దగ్గరే వున్నప్పటికీ, ఎక్కడో దూరం నుంచి పిలిచినట్టుగా వుంది ఆ పిలుపు. మెల్లగా పిలిచిన ఆ కంఠాన్ని ఎక్కడో విన్నట్టుగా వుంది. అయినా తన వైపు చూడకుండానే పిలిచిన ఆ వ్యక్తి స్వరూపాన్ని గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.

"మృదూ! గుర్తించలేదా...!" రెండవసారి అదే కంఠం ఈసారి కాస్త పెద్ద స్వరంతో పిలవగానే వెంటనే గుర్తించాను.

ఎస్..ఎస్.. అతనే... తన ఎదురుగా కూర్చుంది వరుణ్...

మూడేళ్ళ క్రితం...ఆరోజు కాలేజీ సెలబ్రేషన్స్ జరుగుతున్నాయి. అర్ధరాత్రికి గానీ అవి పూర్తి కాలేదు. శ్వేతను తీసుకుని వెళ్ళడానికి వాళ్ళ నాన్నగారు వచ్చారు. వారి వెంటనే తనను రమ్మన్నారు. పదిహేను కిలో మీటర్ల దూరం వచ్చి తనని ఇంటి దగ్గర దిగబెట్టి వెళ్ళడం శ్రమతో కూడుకున్న పని అని తాను వెళ్ళాలా వద్దా? అన్న సందిగ్ధంలో వుండగా వరుణ్ అక్కడికి వచ్చాడు.

"మీకెందుకు శ్రమ అంకుల్! నేను అటే వెడుతున్నాగా. మృదులను వాళ్ళింటి వద్ద దిగబెట్టి వెడతాను" అన్నాడు.

"వెరీగుడ్... గుడ్‌నైట్ మృదూ" అంటూ సెలవు తీసుకుని వాళ్ళు వెళ్ళిపోయారు.

వరుణ్ మంచి స్నేహితుడు. శ్వేత అతణ్ణి ప్రేమించడానికి నేనెంతగానో సహాయం చేశాను. కాలేజీలో సమయం చిక్కినప్పుడల్లా తాము ముగ్గురూ కలసి తిరిగేవాళ్ళు. ఆ విధంగా తిరగడం సగం మంది కుర్రాళ్ళకు ఈర్ష్యగా వుండేది. స్కూటర్ వేగంగా



వెడుతోంది. మరో ఐదారు కిలోమీటర్లు ప్రయాణం చేస్తే ఇల్లు చేరిపోతారు. ఈలోగానే ఆకస్మికంగా వర్షం తగులుకొని జోరందుకుంది. వాన జోరుకు స్కూటర్ ముందుకు సాగడం గగనంగా వుంది. గత్యంతరం లేక పక్కనే వున్న ఒక పురాతన భవనం వరండాలోకి చేరాం. చలి వణికించేస్తోంది. తడిసిన పవిట చెంగును స్తంభం చాటుకెళ్ళి పిండుకుంటున్నాను. ఇంతలో హఠాత్తుగా వెనుక నుంచి వచ్చిన రెండు చేతులు నన్ను బలంగా ఒడిసి పట్టుకున్నాయి. ఊహించని సంఘటనతో కంగుతిన్న నేను కెవ్వున అరుస్తూ వేగంగా తల తిప్పి చూశాను. వరుణ్...! మరింత బలంగా నన్ను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడు. భయంతో వణికి తోంది తను. "వద్దు వరుణ్..వరుణ్ ప్లీజ్..విడిచిపెట్టు. నువ్వు ఎంతో మంచివాడివి అనుకున్నాను. నా గౌరవాన్ని కాపాడుకో. ప్లీజ్.నాకు అన్యాయం చేయకు" అంటూ ఎంత ప్రాధేయపడి గింజుకున్నా అతని బలం ముందు తను బలహీనురాలైంది....

"మృదులా! తలెత్తి ఒక్కసారి అబ్బాయిని చూడమ్మా!" అన్నయ్య పిలుపుతో ఆలోచనల నుంచి ఉలిక్కిపడి వేగంగా ఈ లోకంలోకి వచ్చి తలెత్తి చూశాను. ప్రపంచంలోనే తన లాంటి ఉత్తముడు లేడన్నంత అమాయకంగా మొహం పెట్టి చిరుదరహాసంతో నన్నే తదేకంగా చూస్తున్నాడు వరుణ్. ఆ నవ్వులో తెలియని అపహాస్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. మూడేళ్ళ క్రితం అదృశ్యమైన వరుణ్ ఇక్కడ ఈ రూపంలో ప్రత్యక్షమయ్యే సరికి సహించలేకపోయాను. వేగంగా లేచి నిలబడ్డాను.

అప్పటి వరకూ తనని 'ఈకాలపు అమ్మాయిలాగా లేనని, వంచిన తల ఎత్తకుండా, ఎంతో వినయ పూర్వకంగా కూర్చుందని, అందమైన, చూడముచ్చటైన జంట అని' కొనియాడిన అమ్మలక్కల నోళ్ళు నా చర్యకు ఒక్కసారిగా మూతబడ్డాయి.

"ఏ మొహం పెట్టుకుని ఇక్కడికి వచ్చావు?" ఆవేశంగా వూగిపోతూ తీవ్రమైన స్వరంతో ప్రశ్నించాను వరుణ్‌ను.

అందరూ నావైపే ఆందోళనగా, ఒకింత ఆశ్చర్యంగానూ చూస్తున్నారు. తను ఆవేమీ పట్టించుకోలేదు.

"నువ్వు చేసిన తప్పు ఇప్పుడు గుర్తు వచ్చిందా? నా జీవితం వ్యర్థమైపోతుందని సానుభూతి చూపడానికి వచ్చావా? లేక నీ పురుషాహంకారంతో నన్ను రెండవ సారి కూడా గెలిచి నా అభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడానికి వచ్చావా?"

"మృదూ..మృదూ..ఒక్క క్షణం ఆగమ్మా!" అన్నయ్య వారించే ప్రయత్నం చేస్తున్నా, లావాగ్నిలా ఇంత కాలం నాలో దాగివున్న ఆవేశం ముందు, నా వాక్ప్రవాహం ముందు ఆగలేక మౌనంగా వుండిపోయాడు. కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతున్నా నేను వాటిని లెక్కచేయడంలేదు.

"అర్థరాత్రి...హోరున వర్షం....ఆడపిల్లను...ఒంటరిదాన్ని, స్నేహితురాలినన్న కనీస సానుభూతి కూడా లేకుండా లేడి పిల్లను పెద్దపులి వేటాడినట్టు వేటాడి నా శీలాన్నీ, జీవితాన్నీ శూన్యం చేసిన నరరూప రాక్షసుడివి నీవు. శ్వేతా, నువ్వూ ప్రేమించుకుంటే నేనెంతో సాయం చేసి మీ పెళ్ళి జరగాలని ఆశించాను. కనీసం ఆ కృతజ్ఞత కూడా నీలో ఆరోజు కన్పించలేదు. శ్వేతతో నీతో పెళ్ళికి తిరస్కరించి నా స్నేహానికి విలువనిచ్చేసరికి సహించలేక, ఏవిధంగానైనా నన్ను పెళ్ళి చేసుకుని శ్వేత మనసును దెబ్బతీసి, ఆవిధంగా ఆమెపై కక్ష తీర్చుకోవాలని పథకం వేసుకుని వచ్చావు. నా జీవితాన్ని దౌర్జన్యంగా నాశనం చేసిన నీకు, పెళ్ళి పేరుతో నా మనసును, శరీరాన్ని అర్పిస్తానని ఏవిధంగా వూహిస్తావు? నమ్మి నీ వెంట సహాయం కోరి వచ్చిన నన్ను వంచించావు. మనస్ఫూర్తిగా ప్రేమించిన శ్వేతను ఈ విధంగా వంచనకు గురిచేశావు. నువ్వు మేకవన్నె పులివని గ్రహించలేని మా వాళ్ళు నీ మంచి వంచనకు గురయ్యారు. నమ్మిన వారిని వంచించడమే ధ్యేయంగా పెట్టుకున్న నిన్ను ఏ అమ్మాయి కూడా పెళ్ళి చేసుకుని సుఖంగా జీవించలేదు. గెట్‌లాస్ట్. ఇక్కడినుంచి తక్షణం వెళ్ళిపోండి" అంటూ ఏడుస్తూ కూలబడిపోయాను. నీళ్ళు నిండిన నా కళ్ళకు ఏమీ కన్పించడంలేదు. వాళ్ళెప్పుడెళ్ళారో తెలియదు. నా తల నిమురుతూ, కళ్ళ నీళ్ళు తుడుస్తున్నాయి రెండు చేతులు. చూస్తే అమ్మ ఒళ్ళో నా తల వుంది.